## మురుగు సమస్యకు మోక్షమెప్పుడో?

- జేఎన్‌టీయూహెచ్ డ్రైనేజీ లీకేజీలతో పక్క కాలనీ వాసులకు ఇబ్బందులు
- నిధులు సమకూరినా ప్రారంభం కాని పనులు
- సమస్యలు పరిష్కరించాలంటున్న 3 కాలనీల వాసులు
- విస్మరిస్తున్న జేఎన్‌టీయూహెచ్, బల్దియా అధికారులు



డ్రైనేజీ సమస్య పరిష్కారానికి రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావుతో చర్చిస్తున్న కార్పొరేటర్ (ఫైల్)



జేఎన్‌టీయూహెచ్ ప్రహరీ బయట పొంగి పొర్లుతున్న డ్రైనేజీ

**కేపీహెచ్‌బీకాలనీ:** జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వ విద్యాలయం నుంచి పొంగిపొర్లే దుర్గంధపూరిత డ్రైనేజీ మురుగుతో పక్కనే ఉన్న కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక వర్షాకాలంలో డ్రైనేజీ కాలనీలోకి వచ్చి ముంచెత్తిన సందర్భాలు ఉన్నాయి. మిగతా సమయాల్లో దుర్గంధ భరితంగా రోడ్లపై పారుతున్న మురుగునీటితో ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. యూనివర్సిటీ పక్కనే ఉన్న కేపీహెచ్‌బీ కాలనీ ఆరవ ఫేజ్ వాసులు, భగత్‌సింగ్ నగర్ వాసులు అనేక మార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో ప్రజా ప్రతినిధులను ఆశ్రయించారు.

### కార్పొరేటర్ చొరవతో..

కాలనీ వాసుల గోడు విన్న కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు పలుమార్లు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యను పరిశీలించి అటు జీహెచ్‌ఎంసీ, ఇటు యూనివర్సిటీ అధికారులను కలిసి పరిష్కారం కోసం ప్రయత్నం చేశారు. గత నవంబర్ నెలలో కాలనీవాసులతో కలిసి యూనివర్సిటీ లోపల నుంచి వస్తున్న డ్రైనేజీ సమస్యపై అక్కడి ఎస్టేట్ అధికారులు, ఇంజినీరింగ్ విభాగం అధికారులను నిలదీశారు. గౌతమి, కిన్నెర హాస్టళ్లతో పాటు యూనివర్సిటీలోని మురుగు అవుట్‌లెట్ వద్ద నుంచి పారుతున్న నీటిని బయట జీహెచ్‌ఎంసీకి చెందిన అవుట్‌లెట్ లైన్‌లోకి కలిపేందుకు మరో కొత్త లైన్ ఏర్పాటు చేయాలని కాలనీ వాసుల సమక్షంలో నిర్ణయించారు. ఇందుకయ్యే ఖర్చును యూనివర్సిటీ చెల్లించాలని, పనులను జీహెచ్‌ఎంసీ చేపట్టే విధంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు మందడి శ్రీనివాసరావుతో పాటు స్థానిక కాలనీ వాసులు, జేఎన్‌టీయుహెచ్ ఇన్‌చార్జి వీసీ రిజిస్ట్రార్‌లను కలిసి కోరటంతో అంగీకరించారు.

### నిధులిచ్చినా ప్రారంభం కాని పనులు

జేఎన్‌టీయూహెచ్ నుంచి వెలువడే మురుగు జలాలు 6వ ఫేజ్, భగత్‌సింగ్ నగర్ మీదుగా 450 డయా డ్రైనేజీ అవుట్‌లెట్ లైన్‌లోకి కలిపేందుకు రూ.50 లక్షలను జేఎన్‌టీయుహెచ్ అధికారులు జీహెచ్‌ఎంసీ ఖాతాకు జమ చేశారు. నిధులు జమైనా విషయాన్ని ధృవీకరిస్తూ మూసాపేట సర్కిల్ అధికారులు ఉన్నతాధికారులకు లేఖ రాయడంతో పాటు పనులను చేపట్టేందుకు అనుమతించాలని కోరారు. ఫైనాన్స్ విభాగం నుంచి క్లియరెన్స్ వచ్చి కమిషనర్ అనుమతులను మంజూరు చేస్తే తప్ప పనులను చేపట్టలేని పరిస్థితి నెలకొనడం గమనార్హం.

### త్వరగా పనులు చేపట్టాలి..

డ్రైనేజీ పైపులైన్ నిర్మాణం కోసం జేఎన్‌టీయూ అధికారులు డబ్బులు చెల్లించారని జీహెచ్‌ఎంసీ అధికారులు పనులను త్వరగా చేపట్టాలని కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు కోరారు. ఆరో వ ఫేజ్ వాసులు, భగత్‌సింగ్ నగర్ వాసులు డ్రైనేజీ సమస్యతో సతమతం అవుతున్నారని, త్వరితగతిన పనులను చేపట్టి పూర్తి చేయాలన్నారు.

### అనుమతులు రాగానే పనులు..

జీహెచ్‌ఎంసీ కమిషనర్ నుంచి అనుమతులు రాగానే టెండర్ల ప్రక్రియ చేపట్టి పనులు ప్రారంభిస్తాం. జీహెచ్‌ఎంసీకి జేఎన్‌టీయూహెచ్ డబ్బులు చెల్లించింది. ఫైనాన్స్ విభాగం నుంచి కమిషనర్ అనుమతులు రాగానే పనులను చేపడతాం. – సాయిప్రసాద్, ఏఈ

## 9న న్యూ రామారావు నగర్ సంక్షేమ సంఘం ఎన్నికలు

**మోతీనగర్:** అల్లాపూర్ డివిజన్ న్యూ రామారావు నగర్ సంక్షేమ సంఘం అధ్యక్ష ఎన్నికలు ఈ నెల 9వ తేదీన కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి పోతరాజు నర్సింగ్‌రావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓటింగ్ కొనసాగుతుందన్నారు. అధ్యక్ష పదవికి ఇద్దరు అభ్యర్థులు బరిలో ఉన్నారని ఏ గిరిధర్‌రావుకు సూర్యుడు, కే. రామ్ రెడ్డికి సీలింగ్ ఫ్యాన్ గుర్తులను కేటాయించామని తెలిపారు.

## సెక్టార్ ఎస్‌ఐ బదిలీ

**మోతీనగర్:** అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ గాయత్రి నగర్ సెక్టార్ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న కేతావత్ దేవరాజ్ నందిగామ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. మైలార్ దేవరపల్లి ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న మహ్మద్ అలీ అల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

## 8 నుంచి సద్గురు సాయిబాబా ఆలయ వేడుకలు

**మోతీనగర్:** మూసాపేట డివిజన్ పాండురంగ నగర్‌లోని దేవదాయ ధర్మాదాయ శాఖ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో సద్గురు సాయిబాబా ఆలయ 23వ వార్షిక వేడుకలు ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి గుమ్మడిదల సుధాకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం కాగడ హారతి, నిత్యారాధన, సాయిదత్త మూలమంత్ర ఆహ్వానం, మధ్యాహ్నం హారతి, విష్ణు సహస్రనామ పారాయణం, సంధ్యాహారతి వంటి కార్యక్రమాలతో పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు.

## న్యూ అల్లాపూర్‌లో పర్యటించిన కార్పొరేటర్



సమస్య తెలుసుకుంటున్న కార్పొరేటర్

**మోతీనగర్:** కూకట్‌పల్లి నియోజకవర్గం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని న్యూ అల్లాపూర్‌లో గురువారం కార్పొరేటర్ సబిహా బేగం అధికారులతో కలిసి పర్యటించారు. బస్తీలో జేకే పాయింట్ నుంచి ఖుబా మసీదు చౌరస్తా వరకు డ్రైనేజీ సమస్య ఎక్కువగా ఉందని, కడిచూర్ గల్లీలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సయ్యద్ నసీర్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## రాంనరేష్ నగర్ కాలనీ సమస్యలు పరిష్కరిస్తా

- పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ



పీఏసీ చైర్మన్ గాంధీకి వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

**ఆల్విన్‌కాలనీ:** హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని రాంనరేష్ నగర్ కాలనీ సమస్యలను పరిష్కరిస్తానని పీఏసీ చైర్మన్ గాంధీ అన్నారు. గురువారం గాంధీని వివేకానందనగర్‌లోని ఆయన నివాసంలో కలిసి సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..త్వరలో రాంనరేష్ నగర్ కాలనీలో పర్యటిస్తానని, అసంపూర్తి పనులను పరిష్కరిస్తానన్నారు. త్వరలో సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తామని తెలిపారు. డ్రైనేజీ, మంచినీటి వ్యవస్థను మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు పోతుల రాజేందర్, కాలనీ వాసులు చాట్ల రవి, చెట్టి సత్యనారాయణ, నక్కా సరేష్, చంద్రయ్య, నాగార్జున రెడ్డి, నారాయణ, బ్రహ్మయ్య, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రసన్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సత్యనారాయణ

**కూకట్‌పల్లి:** కూకట్‌పల్లి, ప్రశాంతినగర్‌లోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం 7 గంటలకు సేవాకాలం, పారాయణ, చతుస్థానార్చన, విశేషంగా ఆదిత్య హృదయ స్తోత్ర హవనం, నిత్య పూర్ణాహుతి, ఉదయం 9 గంటలకు శ్రీవార్లకు అష్టోత్తర (108) శతకలశస్నపనము, బలిహరణ, తీర్థ ప్రసాద గోష్ఠి, సాయంత్రం 6 గంటలకు పారాయణం, నిత్యహవనం, పూర్ణాహుతి, శ్రీ వార్ల రాయబార మహోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## పబ్‌లు, హోటళ్లలో భద్రతా చర్యలు తీసుకోవాలి

మాదాపూర్ డీసీపీ వినీత్





పబ్‌లు, హోటళ్లలో తీసుకోవాల్సిన చర్యల గురించి వివరిస్తున్న డీసీపీ వినీత్

**గచ్చిబౌలి:** ప్రిజం పబ్‌లో నిందితుడు బత్తుల ప్రభాకర్ కాల్పుల నేపథ్యంలో మాదాపూర్ జోన్ పోలీసులు అప్రమత్తమయ్యారు. పబ్‌లు, హోటళ్లలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని డీసీపీ డాక్టర్ వినీత్ నిర్వాహకులను ఆదేశించారు. గురువారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో మాదాపూర్ జోన్‌లోని పబ్‌లు, బార్‌లు, హోటళ్ల నిర్వాహకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 1న ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ప్రిజం పబ్‌లో సీసీఎస్ కానిస్టేబుళ్లపై బత్తుల ప్రభాకర్ కాల్పుల నేపథ్యంలో అందరు అప్రమత్తం కావాల్సిన అవసరం ఉందన్నారు. పబ్‌లు, హోటళ్లు, బార్‌లలో అన్ని ప్రాంతాలు కనిపించేలా సీసీ కెమెరాలను అమర్చాలని పార్కింగ్‌ల్లోనూ సీసీ కెమెరాలు ఉంచాలన్నారు. శిక్షణ తీసుకున్న వారిని మాత్రమే సెక్యూరిటీగా నియమించుకోవాలని పేర్కొన్నారు. తనిఖీల సమయంలో వెపన్స్, కత్తులతో పాటు ఇతర వస్తువులు కనిపించినా, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకున్నా డయల్ 100, సంబంధిత పీఎస్‌కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో మాదాపూర్ అడిషనల్ డీసీపీ జయరాం, ఏసీపీ సీహెచ్ వెంకన్న, ఇన్‌స్పెక్టర్లు సీహెచ్ వెంకన్న, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## రంగనాథస్వామి పల్లకీ సేవ



పల్లకీలో ఊరేగుతున్న రంగనాథస్వామి

**రాయదుర్గం:** నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని రంగనాథస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం ఆలయంలో బాలభోగ, అర్చన, బలిహరణ, ఆరాధన తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. అంతకుముందు ఆలయంలో లక్ష్మీదేవి అమ్మవారికి అర్చనలు, అభిషేకం చేశారు. కుంకుమార్చన కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

## ధ్వజస్తంభ పున ప్రతిష్ఠ పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

**మోతీనగర్:** మూసాపేట డివిజన్ తోటలో అభయాంజనేయ స్వామి దేవాలయంలో ధ్వజ స్తంభ పునప్రతిష్ఠ మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గణపతి పూజ, స్వస్తి, పుణ్యహావచనం, పంచగవ్య ప్రాశనం, రక్షాబంధనం, దీక్షాధారణం, యాగశాల ప్రవేశం అంకురార్పాణ, అఖండ దీప స్థాపన వాస్తు, కలశ స్థాపన, మంత్రపుష్పంతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షులు జి. వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఆర్. సత్యనారాయణ స్వామి, మాజీ కౌన్సిలర్ సీహెచ్ సత్యనారాయణ, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## 10న ఉచిత వైద్య శిబిరం

**ఆల్విన్‌కాలనీ:** మెడ, నడుము, వెన్నుముక నొప్పితో బాధపడుతున్న వారికి కూకట్‌పల్లిలోని రాందేవ్ రావ్ ఆసుపత్రిలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రముఖ వైద్యులు హిమాన్సు ప్రసాద్‌చే ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆసుపత్రి నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎక్స్‌రే, న్యూరోపతి టెస్ట్, సీబీపీ, ఈఎస్ఆర్, సీఆర్‌పీ, ఎస్ఆర్ యూరిక్, ఎస్ఆర్ఆర్‌ఏటీబీ 12 డీ, ఆర్ఏ ఫ్యాక్టర్‌కు ఉచితంగా చికిత్స చేయనున్నట్లు తెలిపారు. వైద్యుల సలహా మేరకు సిటీ స్కాన్ 2, ఎమ్మార్ఐ స్కాన్ 2 వేలుకు చేయబడుతుందని తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## 10న భవిష్యనిధి అదాలత్

**మూసాపేట:** మూసాపేటలోని పీఎఫ్ కార్యాలయం ఆధ్వర్యంలో భవిష్యనిధి అదాలత్ నిర్వహించనున్నట్లు పీఎఫ్ కమిషనర్ డాక్టర్ హేమంత్ గురువారం తెలిపారు. ఈ నెల 10వ తేదీన కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్, బస్ టెర్మినల్, రెండవ అంతస్తులోని పీఎఫ్ కార్యాలయంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ఖాతాదారులు తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. సలహాలు, సూచనలు కూడా స్వీకరిస్తామని తెలిపారు.

## బ్రహ్మోత్సవాలకు కీసర ముస్తాబు



**కీసర:** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా కీసరగుట్టకు తరలివచ్చే లక్షలాది మంది యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం, జిల్లా యాంత్రాంగం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 24 నుంచి మార్చి 1వరకు జరగనున్న కీసరగుట్ట బ్రహ్మోత్సవాలకు సుమారు 6 నుండి 7 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా. ఏర్పాట్లకు సంబంధించిన ఆదేశాలు అధికారులు జారీ చేయడంతో పనుల్లో వేగం పెరిగింది. ఇప్పటికే జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆధ్వర్యంలో కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలపై నిర్వహించిన సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ చీఫ్‌విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి ఏర్పాట్లకు తగిన సూచనలు చేసిన విషయం విధితమే.

**ఏర్పాట్లు ఇలా...**

కీసరగుట్ట ప్రధాన ఆలయం వద్ద ఇప్పటికే క్యూలైన్లు సిద్ధమౌతున్నాయి. గతంలో స్వామిదర్శనం కోసం 5 క్యూలైన్లు ఏర్పాటు చేస్తే.. ఈసారి 6 క్యూలైన్లు ఏర్పాటు చేసి 3 క్యూలైన్లు సామాన్య భక్తుల కోసం ఏర్పాటు చేశారు. దీంతో ఉచిత దర్శనం కోసం క్యూలైన్లలో ఉండే భక్తులకు త్వరితగతిన స్వామివారి దర్శనం చేసుకునే అవకాశం ఉంటుంది.

**ఆకర్షణీయంగా రంగులు..**

ప్రధాన ఆలయంతో పాటు మహామండపం, రాజగోపురాలు, ఆంజనేయస్వామి విగ్రహానికి రంగులు వేసే పనులు కూడా కొనసాగుతున్నాయి.

ఇక కీసరగుట్ట ప్రధాన దేవాలయం, ఆంజనేయ స్వామి దేవాలయం తదితర ప్రాంతంలో భక్తులు సేద తీరేందుకు చలువ పందిళ్ల ఏర్పాట్లు కూడా కొనసాగుతున్నాయి.

**చెట్ల కొమ్మల తొలగింపు..**

ఇక విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో రహదారుల వెంట విద్యుత్‌లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే పనులు దాదాపు పూర్తయ్యాయి. జాతర జరిగే ప్రాంతంలో అవసరమైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు త్వరలోనే ప్రారంభిస్తామని విద్యుత్ ఏఈ మురళికృష్ణ తెలిపారు.

**వంటశాలకు శాశ్వత షెడ్డు..**

లడ్డూప్రసాదాలు తయారీకి ప్రతి ఏటా తాత్కాలికంగా వంటశాల ఏర్పాటు చేసేవారు. ఈసారి వంటశాలకు కుడా పర్మనెంట్‌గా షెడ్డు ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులు కుడా కొనసాగుతున్నాయి.

**రూ.1.50 కోట్ల నిధుల కేటాయింపు..**

బ్రహ్మోత్సవాలకు సుమారు రూ. కోటిన్నర వరకు నిధులను ప్రభుత్వం కేటాయిస్తున్నట్లు సమాచారం. శీఘ్ర దర్శనం, అభిషేకం టిక్కెట్లు ఆన్‌లైన్‌లో కూడా అందుబాటులో టిక్కట్లు ఉంటాయి. భక్తులు ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్‌చేసుకుని సమయానికి వచ్చి స్వామిదర్శనం చేసుకునేలా దేవస్థానం తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

**24 గంటలు అన్ని సౌకర్యాలు..**

జాతర జరిగే రోజుల్లో 24 గంటల పాటు భక్తులకు తాగునీరు, నిత్యావసరాలకు కావాల్సిన నీటిని సరఫరా చేసేలా మిషన్ భగీరథ అధికారులు తగిన చర్యలు చేపడుతున్నారు. 24గంటలు పారిశుద్ధ్య కార్మికులతో దేవాలయ ప్రాంగణం, జాతర జరిగే పరిసర ప్రాంతమంతా పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టనున్నారు.

**వాహనాల పార్కింగ్‌కు..**

ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో వాహనాల పార్కింగ్ కోసం ఏర్పాట్లు, భారికేడ్లు ఏర్పాట్లు చేయనున్నారు. 24 గంటలపాటు అంబులెన్స్‌లతో పాటు వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంటాయి.

- తామర కొలను దగ్గర గజ ఈతగాళ్లను మత్స్యశాఖ అధికారుల ఆధ్వర్యంలో సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నారు.
- వివిధ ప్రాంతాల నుంచి యాత్రికుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు సుమారు 400 నుంచి 800 వరకు ప్రత్యేక బస్సులు నడిపేలా తగిన చర్యలు చేపడుతున్నారు.

**సైన్ బోర్డుల ఏర్పాటు..**

వయోవృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బంది కలగకుండా వై జంక్షన్ నుంచి దేవాలయం వరకు ఉచిత ఆటోలు, షెటిల్ బస్సులను ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం ఎక్కడికక్కడే సైన్‌బోర్డులను ఏర్పాటు చేయనున్నారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సుమారు 1700 నుంచి 2000 వేల మంది పోలీసులతో తగిన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. అన్ని శాఖల సమన్వయం కోసం సమీకృత కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసి జాతరను విజయవంతం చేసేలా అధికారులు తగిన చర్యలు చేపడుతున్నారు.

## కేపీహెచ్‌బీ ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వరరావు బదిలీ

**కేపీహెచ్‌బీ కాలనీ:** కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు బదిలీ అయ్యారు. సైబరాబాద్ సిటీసీకి బదిలీ చేస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ రాజశేఖర్‌రెడ్డికి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## రోడ్ల విస్తరణ చేపట్టాల్సిందే..

- ఐటీ ట్రాఫిక్‌కు పరిష్కారం.. మాస్టర్ ప్లాన్
- ప్రజారవాణాను ప్రోత్సహించాలి



గచ్చిబౌలి స్టేడియం రోడ్డులో ట్రాఫిక్ జాం

**గచ్చిబౌలి:** ఐటీ కారిడార్‌లో విశాలమైన రోడ్లు, ఫ్లైఓవర్లు, అండర్ పాస్ తదితర మౌలిక వసతులున్నా నిత్యం అడుగడుగునా ట్రాఫిక్ జామ్ తప్పడం లేదు. ఐటీ, ఐటీ ఆధారిత ఉద్యోగులు గంటల తరబడి ట్రాఫిక్‌లోనే గడపాల్సి వస్తుంది. మాస్టర్ ప్లాన్ మేరకు ప్రధాన రహదారుల విస్తరణ చేపట్టకపోవడంతో సమస్య తప్పడం లేదు. ఉదయం, సాయంత్రం సమయంలో లక్షలాది వాహనాల రాకపోకలతో ఐటీ కారిడార్‌ను ట్రాఫిక్ సమస్య వీడడం లేదు. మాదాపూర్, గచ్చిబౌలి, నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ఐటీ కంపెనీలకు ప్రతి రోజు ఐటీ, ఐటీయేతర ఉద్యోగులు దాదాపు 10 లక్షల మంది రాకపోకలు చేస్తుండడంతో ఐటీ కారిడార్‌కు వచ్చే అన్ని రహదారులు ట్రాఫిక్ మయంగా మారుతున్నాయి. వాహనదారులు ఉదయం, సాయంత్రం సమయాల్లో గంటల తరబడి ట్రాఫిక్‌లోనే గడుతున్నారు. ఇప్పటికీ కొన్ని కంపెనీలు హైబ్రిడ్ విధానంలో ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం అవకాశం కల్పించాయి. సోమవారం, బుధవారం, శుక్రవారం ఉద్యోగులంతా హాజరు కావాల్సి ఉంటుంది. ఆ మూడు రోజుల్లో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమవుతుంది.

### మౌలిక వసతులు ఉన్నా...

సైబర్‌టవర్, బయోడైవర్సిటీ, రాయదుర్గం, శిల్పా లేవుట్, గోపన్‌పల్లి, మైండ్‌స్పేస్ జంక్షన్, కొత్తగూడ, కేబుల్ బ్రిడ్జి తదితర ప్రాంతాలలో 10 ఫ్లైఓవర్లు ఉన్నాయి. ఓఆర్ఆర్ నుంచి కొండాపూర్ వైపు, చందానగర్‌లో జాతీయ రహదారిపై ఫ్లైఓవర్‌లు నిర్మాణ దశలో ఉన్నాయి. అంతే కాకుండా హఫీజ్‌పేట్, హైటెక్‌సిటీ, నల్లగండ్లలో ఆర్‌ఓబీలు, కొత్తగూడ, మైండ్ స్పేస్, శిల్పారామం, కేపీహెచ్‌బీలలో నాలుగు అండర్‌పాస్‌లు ఉన్నాయి. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 14 లింక్ రోడ్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. అయినప్పటికీ ట్రాఫిక్ సమస్య వెంటాడుతోంది.



కొత్తగూడ ఫ్లైఓవర్‌పై నిలిచిపోయిన వాహనాలు

### ప్రజారవాణా మెరుగుపడాలి

ఐటీ ఉద్యోగులు ఎక్కువగా సొంత బైక్‌లు, కార్లలో వస్తున్నారు. తక్కువ సంఖ్యలో క్యాబ్‌లు, బస్సులలో వెళుతున్నారు. వ్యక్తిగత వాహనాల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ట్రాఫిక్ జాం నెలకొంటుంది. రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు, మియాపూర్ నుంచి హైటెక్‌సిటీ, ఆల్విన్ కాలనీ నుంచి గచ్చిబౌలి జంక్షన్‌కు మెట్రో రైల్ అందుబాటులో ఉంటే ట్రాఫిక్ తగ్గే అవకాశం ఉంది.





ట్రిపుల్ ఐటీ జంక్షన్‌లో..

### ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలు ఇవే..

- షేక్‌పేట్ నాలా నుంచి రాయదుర్గం పోలీస్‌స్టేషన్ వరకు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోతున్నాయి.
- నానక్‌రాంగూడ రోటరీ నుంచి గచ్చిబౌలి జంక్షన్ వరకు ఉదయం పూట ట్రాఫిక్ జామ్ నెలకొంటుంది. గచ్చిబౌలి స్టేడియం నుంచి ట్రిపుల్ ఐటీ జంక్షన్ వరకు ట్రాఫిక్ తిప్పలు తప్పడం లేదు.
- ఆల్విన్ కాలనీ జంక్షన్ నుంచి గచ్చిబౌలి వరకు ప్రతిరోజు ట్రాఫిక్ జాం ఉంటోంది.
- నల్లగండ్ల ఫ్లై ఓవర్ నుంచి గుల్‌మొహర్ కాలనీ జంక్షన్ వరకు వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి.
- జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడి నుంచి మాదాపూర్‌లోని కాకతీయహిల్స్ వరకు ట్రాఫిక్ సమస్య వెంటాడుతోంది.
- హైటెక్ సిటీ ఆర్‌ఓబీ నుంచి మైండ్‌స్పేస్ వరకు కిలోమీటర్ల పొడవునా వాహనాలు బారులుదీరుతున్నాయి
- కొండాపూర్‌లోని శ్రీరాంనగర్‌లో.. ఇక ఆల్విన్ కాలనీ జంక్షన్ ట్రాఫిక్ జాంలోనే ఉంటోంది.

### విస్తరించాల్సిన మాస్టర్ ప్లాన్ రోడ్లు

- నానల్‌నగర్ నుంచి బీహెచ్‌ఈఎల్ క్రాస్ రోడ్డు వరకు 210 అడుగుల ఉండాల్సి ఉండగా 120 అడుగులకే పరిమితమైంది. డోయన్స్ కాలనీ, ఆలింద్ ఫ్యాక్టరీ వద్ద కేవలం 100 అడుగులు మాత్రమే ఉంది.
- గచ్చిబౌలి జంక్షనుంచి హైటెక్‌సిటీ ఆర్‌ఓబీ వరకు 150 అడుగుల రోడ్డుకు కేవలం 120 అడుగులు ఉంది. ఇటీవల ఒక వైపు యశోద హాస్పిటల్ వరకు రోడ్డును విస్తరించారు.
- బొటానికల్ గార్డెన్ నుంచి హెచ్‌సీయూ డిపో వరకు 80 అడుగులకే పరిమితం చేశారు. 120 అడుగుల మేర విస్తరణ చేపడితేనే ట్రాఫిక్ ఉపశమనం కలిగే అవకాశం ఉంది.

ఐటీ కారిడార్‌కు వచ్చే అన్ని వైపులా ప్లాన్ ప్రకారం రోడ్డును విస్తరిస్తేనే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. తాజా పరిస్థితులకు అనుగుణంగా కొత్తగా మాస్టర్ ప్లాన్ వేస్తేనే శాశ్వత పరిష్కారం కలుగుతుంది.